


# పందిలా బ్రతకటం

కొత్తపల్లిపత్రికలో ఎలాంటి కథలుంటే బాగుంటుందని ఆలోచిస్తున్న సమయంలోనే కీ.శే.ఎ.కె.రామానుజన్ గారు సేకరించిన జానపద కథల సంపుటి ఒకటి గుర్తుకు వచ్చింది. అందులో చాలా రత్నాలున్నాయి- ఒక రత్నం, ఇదిగో ఇదీ-

ఒక రోజున ఒక గురువుగారికి అతీంద్రియ జ్ఞానం కలిగింది. తాను త్వరలో మరణించనున్న విషయం ఆయనకు తెలిసిపోయింది. అంతేకాక, తరువాతి జన్మలో తాను ఎలా పుట్టనున్నది కూడా ఆయనకు తెలిసిపోయింది. అందువలన ఆయన తన ప్రియ శిష్యుడిని పిలిచి గురుదక్షిణగా ఏమిస్తావని అడిగాడు. గురువుగారికి ఏది ఇష్టమైతే అది చేస్తానన్నాడు శిష్యుడు. " తప్పకుండా చేస్తావు కదూ, మాట తప్పవుకదూ? 'తప్పన'న్నాడు శిష్యుడు.

ప్రమాణం చేయించుకున్న తర్వాత గురువుగారన్నారు - " అయితే నేను చెప్పేది శ్రద్ధగా విను. నీ మాట తప్పకు. నేను త్వరలో ఈ శరీరాన్ని వదిలివేయబోతున్నాను. ఆ తరువాత నేనొక పందిగా పుట్టవలసి ఉంది. మన పెరట్లో చెత్తనూ, మురికినీ తింటున్న ఆ పెద్ద పందిని చూశావుకదా? దానికి ఈసారి పుట్టబోయే పిల్లల్లో నాలుగోదిగా నేను పునర్జన్మనొందుతాను. నానుదుటిమీద ఒక మచ్చ ఉంటుంది. దాని ఆదారంగా నువ్వు నన్ను గుర్తించగలవు. పెద్ద పంది ఈసారి ఈనినప్పుడు దాని పిల్లల్లో నాలుగోదాన్ని, నుదుటిమీద మచ్చద్వారా గుర్తించు. దాన్ని పట్టుకొని , కత్తితో ఒక పోటు పొడిచి చంపెయ్యి. దాంతో నాకు పంది జీవితంనుండి విముక్తి లభిస్తుంది. నువ్వు నాకోసం ఈ పని చేయగలవా?" అన్నాడు.

అదివిన్న శిష్యుడు చాలా బాధపడ్డాడు. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి సరేనన్నాడు. ఈ సంభాషణ జరిగిన తర్వాత కొద్దిసేపటికే గురువుగారు మరణించారు. గురువుగారు చెప్పినట్టే కొద్దిరోజులలో, ఆ పెద్దపందికి నాలుగు పిల్లలు పుట్టాయి.

ఒకరోజున శిష్యుడు ఒక కత్తిని తీసుకొని, దానికి బాగా పదును పెట్టి , నాలుగో పిల్లను పట్టుకున్నాడు. దాని నుదుటి మీద మచ్చఉన్నది, గురువుగారు చెప్పినట్టుగానే. శిష్యుడు గుండెను రాయి చేసుకొని ఆ పందిపిల్ల మెడను చీల్చేందుకు కత్తిని దింపబోతూండగానే ఆ పంది పిల్ల " ఆగు! నన్ను చంపకు! " అని గట్టిగా అరిచింది. పందిపిల్ల మాట్లాడటం ఏమిటని శిష్యుడు నిర్ఘాంతపోయాడు. అతడు ఇంకా తేరుకోకముందే పందిపిల్ల అన్నది తన్నుకుంటూ- " నన్ను చంపకు. నేను ఇప్పుడు పందిలాగా జీవితం కొనసాగించాలని అనుకుంటున్నాను. నాకు శీఘ్రంగా విముక్తి కలిగించమని నిన్ను కోరినప్పుడు, నాకు నిజంగా తెలియదు - పంది జీవితం ఎలా ఉంటుందో. నిజానికి ఈ జీవితం చాలా అద్భుతంగా ఉంది. నన్ను వదిలి పెట్టు చాలు. నన్ను బ్రతకనీ" అని.

కథల్లో ఓ అందం ఉంటుంది.

చెప్పాలనుకున్నదాన్ని కథలు సూటిగానూ చెప్పగలవు, వంకరగానూ చెప్పగలవు. కొన్ని కథలు అద్భుతాలు. అవి ఏం చెప్పదలచిందీ ఆలోచిస్తే తప్ప అర్థం కావు. అలాగని మన ఆలోచనకు అర్థమైన సంగతినే అవి చెప్తాయా అని అంటే, అదీ సత్యంకాదు.

కథల్ని కథలుగా చూడగలిగితే బాగుంటుంది. వాటినుండి ఎప్పటి స్ఫూర్తిని అప్పుడు పొందగలిగితే బావుంటుంది. రకరకాల మనుషులకు నచ్చేందుకుకూడా రకరకాల కథలు అవసరం. కొత్తపల్లి పత్రికలోకి రకరకాల కథలు రావాలి. కొన్ని వెంటనే నచ్చితే, కొన్ని కొంతకాలం తరువాత

నచ్చచ్చు. కొన్ని కొందరికి నచ్చితే, కొన్ని అందరికీ నచ్చచ్చు. ఏమైనా, రకరకాల కథలు వస్తేనే మంచిది. మీరేమంటారు?

ఇక, ఈ నెల కొత్తపల్లి పత్రిక పాటల్లోకి ఇంకొంత వైవిధ్యత తెచ్చాం. ఇందులోని ఆరు పాటలూ చెక్కభజన పాటలే. మరుగున పడుతున్న జానపద కళారూపాల్లో ఒకటి, చెక్క భజన. వందలాది గేయాలతో బహు జనాదరణకు నోచుకున్న చెక్కభజనలో బావా మరదళ్ల పాటలతోబాటు ఇతర రచనలూ అనేకం చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లాలో పల్లె పిల్లలకు ఇంకా సన్నిహితంగానే ఉన్న చెక్కభజన పాటల్లోని ప్రాచీన సాహిత్యపు రుచుల్ని సంకలితం చేద్దామనుకుంటే, ఆరు పాటలు మాత్రం లభించాయి ఇప్పటికి. ఈ ప్రయత్నాన్ని కొనసాగించి, వీలైనన్ని ఎక్కువ గీతాల్ని, వాటి ట్యూన్లను సేకరించాలని ఉద్దేశం. మొదటి అడుగు పడింది కాబట్టి, ముందడుగులూ వీలౌతాయని ఆశిద్దాం. కొత్తపల్లికి మీ ఆదరాభిమానాలు కొనసాగుతాయని ఆశిస్తూ,

మీ

కొత్తపల్లి బృందం.

# దురాశ

*రచన: విష్ణు, ఏడవ తరగతి, ప్రకృతి బడి*

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఒక పేదకుటుంబం ఉండేది. ఆ కుటుంబ యజమాని సీతయ్య. ప్రతి రోజూ అతను దగ్గరలోని అడివికి పోయి, కట్టెలు కొట్టుకొచ్చి, వాటిని గ్రామంలో అమ్మి, తన కుటుంబాన్ని పోషించేవాడు. అంత పేదరికంలోకూడా అతను, తనకున్నదాంట్లో ఇతరులకు సాయపడేవాడు. ఒక ఏడు కరువు వచ్చి, పంటలు సరిగ్గా పండలేదు. ఊళ్ళోని జనాలదగ్గర డబ్బులు తక్కువవడంతో, ఆ ప్రభావం సీతయ్య కట్టెల వ్యాపారంమీద కూడా బాగా పనిచేసింది. డబ్బులులేని కారణంగా కట్టెలు కొనే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. సీతయ్య కుటుంబానికి పూటగడవడమే కష్టమయిపోయింది.

ఒకనాడు సీతయ్య కట్టెలకోసం అడవికి వెళ్ళాడు. కట్టెలు కొడుతూండగా మధ్యలో దాహంవేసింది. దగ్గర్లోని నీటి చెలమకు పోయి, నీళ్ళు తాగి, "అమ్మా! ఎంత కష్టం వచ్చిందమ్మా నాకు!" అని నిట్టూర్చాడు. వెంటనే వనదేవత ప్రత్యక్షమయింది. 'ఏమికావాలో కోరుకొమ్మం'ది. సీతయ్య తన కష్టాలనన్నింటినీ చెప్పుకొన్నాడు. అప్పుడూ వన దేవత సీతయ్యకు మూడు టెంకాయలిచ్చి, "ఈ మూడూ టెంకాయలనూ కొడుతూ నీవు ఏమి కోరుకొంటే అది జరుగుతుంది నాయనా" అని చెప్పి మాయమయిపోయింది.



సీతయ్య సంతోషంగా ఇంటికి వెళ్ళి మూడు టెంకాయలనూ కొడుతూ, తనకు ఓ పెద్ద భవనమూ, దండిగా సంపదా, తమ ప్రాంతం మొత్తానికీ సకాల వర్షాలూ కావాలని కోరుకొన్నాడు. అతని కోరిక ప్రకారమే అన్నీ జరిగాయి.

సీతయ్య ఇంటిపక్కనే పిసినారి పుల్లన్న ఒకడు ఉండేవాడు. అతను వ్యాపారంలో బాగా సంపాదించి కూడబెట్టాడు. అతనికి రెండు గాడిదలుండేవి. అవంటే అతనికి ఎంతో ఇష్టం. వడ్డీ కట్టనందుకు గానూ తను చాకలివాని దగ్గరనుండీ బలవంతంగా లాక్కొన్న బాపతువి అవి. సీతయ్య ఒక్క రోజులో షావుకారి అయిపోవడం పిసినారి పుల్లన్నకు ఆశ్చర్యం కలిగించింది. సీతయ్య దగ్గరికెళ్ళి విషయమేమిటని అడిగాడు. సీతయ్య జరిగినదంతా చెప్పాడు.

మరుసటి రోజు పిసినారి పుల్లన్న అడవికి బయలుదేరి నీటి చెలమ దగ్గర కూర్చొని "అమ్మా! ఎంత కష్టం వచ్చిందమ్మా నాకు!" అని మొత్తుకున్నాడు. వనదేవత ప్రత్యక్షమైంది. సీతయ్యకు ఇచ్చినట్లే మూడు టెంకాయలనూ ఇచ్చింది. మాయమైంది.

పుల్లన్న ఇంటికెళ్ళి, మొదటి టెంకాయను కొట్టబోతున్నాడు. అంతలో ఒక బిక్షగాడు వచ్చి, "బాబూ! ధర్మం బాబూ!" అని అడిగాడు. 'శుభమా, అని టెంకాయ కొడుతుంటే వీడొకడ'ని కోపగించుకున్న పుల్లన్న కొబ్బరికాయను కొడుతూనే, "నువ్వొక్కడివీ వస్తే ఎలా సరిపోతుంది గాడిదా!" అన్నాడు. టెంకాయ మహాత్యంతో, అంతలోనే పుల్లన్న ఇల్లంతా గాడిదలతో నిండిపోయింది. "ఇదేమిటి, ఇలా జరిగింది?" అని కంగారు పడ్డాడు పుల్లన్న. ఆ కంగారులో రెండవ టెంకాయను కొడుతూ, "అమ్మా! ఈ గాడిదలన్నింటినీ తీసేసుకోమ్మా!" అన్నాడు. తన సొంత గాడిదలతో సహా గాడిదలన్నీ మాయమయ్యాయి. "అయ్యో! నా ప్రియమైన గాడిదలు! అవి పోతే ఎలా?" అంటూనే మూడవ టెంకాయను కొట్టాడు పుల్లన్న. తన రెండు గాడిదలూ తిరిగి వచ్చాయి. మూడు టెంకాయలూ అయిపోయాయి, కానీ వనదేవత టెంకాయల వల్ల ఏమీ ప్రయోజనం కలగలేదు పాపం, పుల్లన్నకు!

# హరికథ చేసిన మేలు

*రచన : భరత్, తొమ్మిదో తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.*

ఒక ఊరిలో రామయ్య అనే గొర్రెల కాపరి ఉండేవాడు. ఒకసారి వాళ్ళఊరి గుడిలో హరికథ చెబుతున్నారు. ఆ సంగతి తెలుసుకొన్న రామయ్య, ఆ రాత్రికి గొర్రెల మందలోకి పనివాణ్ణి పంపి, తను హరికథ వినడానికి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు అతని భార్య అతనికి కొన్ని పప్పులు(పుట్నాలు) ఇచ్చి పంపింది. అయితే గొర్రెల్లో ఉండీ ఉండీ నోరాగకుండా తినటం అలవాటైంది రామయ్యకు. భార్య ఇచ్చిన పప్పులు కాసిన్నీ హరికథ చెప్పేచోటికి వెళ్ళేలోపే తినేసాడు రామయ్య. గుడిని చేరుకొని చూస్తే, హరి కథ చెప్పే దాసుగారు ఇంకా రాలేదు. నోరాగని రామయ్య ఇక ఆగలేకపోయాడు. పప్పులకోసం తిరిగి ఇంటికి వెళ్లాడు. భార్య ఇంట్లో ఉన్న పప్పులన్నింటినీ బట్టలో కట్టి ఇచ్చింది రామయ్యకు. ఇక అతను సంతోషంగా వాటిని తినుకుంటూ హరికథకు వెళ్ళాడు. హరికథ మొదలయింది.



దాసుగారు "ఆఁ, అందరూ వచ్చారా? ఆఁ, అందరూ కూర్చోండి! సరే!! అయితే ఇక మొదలు పెడదామా?" అని అంటూండే లోపే, కడుపునిండా తిన్న రామయ్య నిద్రలోకి జారుకున్నాడు. హరికథంతా అయిపోయేసరికి అర్ధ రాత్రయింది. అందరూ ఇళ్లకు వెళ్తుండగా మేలుకున్న రామయ్య " ఆఁ, అందరూ వెళుతున్నారా?" అని హరికథ చెప్పే దాసుగారు అనటం మాత్రం విన్నాడు. ఇక తనూ లేచి, అందరితోపాటూ తీరికగా ఇంటికి చేరుకున్నాడు.

అప్పటికి సమయం ఒంటిగంటయ్యింది. సరిగ్గా అదే సమయానికి కొందరు దొంగలు రామయ్య ఇంటికి దొంగతనానికని వచ్చి ఉన్నారు. ఇంటికెళ్ళిన రామయ్యను, హరి కథలో ఏమి చెప్పారని అడిగింది భార్య. అడగ్గానే, " ఆఁ, అందరూ వచ్చారా?" అనిగట్టిగా అన్నాడు రామయ్య. అది విన్నపెరట్లోని దొంగలు తామొచ్చింది ఇంటిలోనివారికి తెలిసిపోయిందనుకొని, పాదలమాటున నక్కి కూర్చున్నారు. ఈ సారి రామయ్య, " ఆఁ! అందరూ కూర్చున్నారా?" అన్నాడు. తామొచ్చింది ఇంట్లోని వారికి ఖచ్చితంగా తెలిసిపోందనుకున్నారు బయటున్న దొంగలు!. ఈసారి రామయ్య "సరే! అయితే మొదలుపెడదామా! " అన్నాడు. తమను పట్టుకోవడానికి ఇంట్లోని వారందరూ వస్తున్నట్టున్నారని దొంగలంతా పారిపోతుండగా, "ఆఁ! అందరూ వెళ్ళిపోతున్నారా?" అన్నాడు రామయ్య, దాసుగారు అన్నట్లుగా. దాంతో దొంగలు హడావిడిగా కాలికి బుద్ధి చెప్పారు. హరికథను వినకుండానే రామయ్యకు అంతమేలు జరిగింది, విని ఉంటే ఏమయ్యేదో కదా!?

ఈ కథను చదివిన మనందరికీ ఏమౌతుందో చూడాలి ఇక! :-)

# నక్క తిక్క కుదిరింది

*రచన: సుమలత, ఎనిమిదో తరగతి, నారనాగే పల్లి, రొద్దం మండలం, అనంతపురం జిల్లా.*



అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక నక్క. అది ఒక రోజున వేటగాడు పన్నిన ఉచ్చులో చిక్కుకున్నది. చాలా కష్టపడి, చివరకు తప్పించుకున్నది. అయితే అలా పెనుగులాడుతున్నప్పుడు దాని తోక సగానికి పైగానే తెగిపోయింది. ఇప్పుడు దానికి పొడవైన కుచ్చు తోక లేదు: కేవలం ఒక పొట్టి తోక మాత్రమే మిగిలింది. దానితో ఆ నక్కకు పెద్ద దిగులు పట్టుకుంది. "అందరూ నన్ను చూసి నవ్వుతారే! ఎగతాళి చేస్తారే!" అనుకొంటూ తెగ బాధపడింది.

అలా దిగులుపడిన నక్క, తనకు సహజమైన వంకర బుద్ధితో "నాకొక్కదానికే కాకుండా మిగిలిన నక్కలన్నింటికీ పొట్టితోక ఉంటే తప్ప నాకీ అవమాన భారం తప్పదనుకొంది. "అప్పుడు గానీ నేను అడవిలో ప్రశాంతంగా గడపలేను" అనుకొన్నది. అనుకున్నదే తడవుగా తమ జాతివారి సమావేశం ఏర్పాటుచేసింది. అడవిలోని నక్కలన్నీ సమావేశానికి హాజరయ్యాయి.

సభను ఉద్దేశించి మాట్లాడుతూ పొట్టితోక నక్క, మిత్రులారా! భగవంతుడు మనకీ బొచ్చుతోకను ఎందుకిచ్చాడోకానీ , ఇదో పనికిమాలిన భాగం - మన శరీరంలో. ఇది పెద్దగా ఉన్నాఒకటే, చిన్నగా ఉన్నా ఒకటే. ఇది పెద్దగా ఉంటే మనకు ఎన్నో ప్రమాదాలు, చిక్కులూనూ. దానివల్ల ఎదురయ్యే కష్టాలను నేను ఎదుర్కొన్నానుకూడా! అందుకనే నేను నాఈ తోకను కత్తిరించేసుకున్నాను చూడండి" అని తెగిపోయిన తన పొట్టితోకను నక్కలకు చూపించింది. "కావున మిత్రులారా! నేను చెప్పేది ఏమిటంటే, మీరుకూడా నాలాగానే మీతోకలనూ కత్తిరించుకోండి. చిన్న తోకతో హాయిగా ఉండడానికి అందరూ సిద్దంకండి. చిన్నతోక అందంగా ఉండదనకండి, అలవాటైతే బాగానే ఉంటుంది. అందం అనేది మన అలవాటు పైనే ఆధారపడి ఉంటుందని పెద్దలు చెబుతారు; అంతేకాక తోకను తెంపుకుంటే మనకు పొడుగు తోకతో వచ్చే బాధలూ తప్పుతాయి- ఏమంటారు?" అని మాట్లాడింది.

ఆ ఉపన్యాసం విన్న నక్కల్లో కొన్నిటికి ఆ ఆలోచన నచ్చింది. ఆ సలహా బాగుందనే భావించాయి అవి. అనుభవపూర్వకంగా చెప్పిన దానిని అనుసరించడంలో తప్పేముందని అవి అనుకున్నాయి.

అయితే వచ్చిన నక్కల్లో తెలివైన ముసలి నక్క ఒకటి ఉండింది. అది ఇలా అన్నది. " కొత్త విషయాలు తెలుసుకోవాలి, వీలయినన్ని నేర్చుకోవాలి. అందులో తప్పేమీ లేదు. కానీ, ఉన్న తోకల్ని చిన్నవి చేసుకోవడమేమిటి? ఇది చాలా తెలివి తక్కువ ఆలోచన. అసలు తోకలు చిన్నవిగా తెంపుకోవాల్సిన అవసరమేమిటి? ఆలోచించండి! భగవంతుడు, ఎందుకో, వాటిని కాస్తంత పెద్దవిగా ఇచ్చాడు. ఆయనకు తెలియదా, చిన్నవి పెట్టాలో, పెద్దవి పెట్టాలో? వీడికేదో అనుభవమైందని మిగిలినవారందర్నీ తోకలు కోసేసుకొమ్మంటే మనం కోసేసుకోవడమేనా? ఇందులో ఏదో మోసం ఉన్నట్లుంది. ఏ నిర్ణయమైనా ఆవేశంగా తీసుకోకూడదు. కాస్త ఆలోచించి నిర్ణయించుకోవాలి. ఇలాంటి మోసపు మాటలు వింటే, తర్వాత అందరూ బాధపడాల్సి వస్తుంది. వీడు చెప్తున్నట్లు అందరూ తోకలు తెంపుకోవాల్సిన అవసరమేమీలేదు. ఆలోచించండి" అని అన్నది ముసలి నక్క. నిజాన్ని గ్రహించిన నక్కలు ఒక్కటొక్కటే సమావేశం నుండి జారుకొన్నాయి. చివరికి అక్కడ పొట్టితోక నక్క మాత్రమే మిగిలింది- విచారవదనంతో..తన పాచిక పారనందుకు పరితపిస్తూ!

# సూర్యుడు-చంద్రుడు

*సూర్యుడు - చంద్రులగురించిన చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆ జాబితాలోకి మరో కథను కలుపుతున్నట్లుంది ఎనిమిదో తరగతి గాయత్రి. చదవండి- సూర్యుడు చంద్రుడు అన్నదమ్ములంటే నమ్మండి.*



అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఒక కుటుంబం. అమ్మా, నాన్న, వారి ఇద్దరి కొడుకులూ. పిల్లలిద్దరినీ తల్లి దండ్రులు ఎంతో ప్రేమగా పెంచి పెద్ద చేశారు. పెద్దవాళ్ళయ్యాక, కొడుకులిద్దరికీ పెళ్ళిళ్ళూ చేశారు. కొడుకులిద్దరూ మంచి స్థితిలోనే ఉన్నారు. తల్లి తండ్రులు ఇప్పుడు ముసలివాళ్లయ్యారు. వారి శక్తులు సన్నగిల్లాయి. పొట్టకూటికోసం కొడుకుల పైననే ఆధారపడాల్సి వస్తున్నది. చిన్నవాడు తల్లితండ్రుల్ని, బాగా చూసుకొనేవాడు. పెద్దవాడు మాత్రం వారిని అస్సలు పట్టించుకొనేవాడు కాదు.

ఒకసారి చిన్నవాడు ఏదో పనిమీద పక్క ఊరికి వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే వాళ్ళ తండ్రికి జబ్బు చేసింది. తల్లి వెళ్ళి విషయాన్ని ఊళ్లో ఉన్న పెద్దకొడుక్కి చెప్పింది. అది వినికూడా పెద్దకొడుకు తనకేమీ పట్టనట్లుగా, "నాకేమీ తెలియదు . నా వద్దకు రాకు, పో! వెళ్ళిపో!" అన్నాడు. అంతలోనే వాళ్ల నాన్న పరిస్థితి విషమించింది. ఆయన చనిపోయాడు. విషయం తెలుసుకున్న చిన్నవాడు వచ్చి దహన సంస్కారాలు జరిపించాడు. భర్త చనిపోయిన భాధతో ఆ తల్లి కూడా చనిపోయింది. పోయేముందు ఇలా అన్నది: "ఒరేయ్! కన్నవాళ్ళని చూడని పెద్దోడా! నువ్వు నిరంతరం భగభగ మండే సూర్యుడివి అయిపో... చిన్నోడా! నువ్వు చల్లని వెన్నెలనిచ్చే చంద్రుడివయిపో నాయనా!" అన్నది.

అలా ఏర్పడ్డారట సూర్య చంద్రులు....


(నిజమేనంటారా?)

# తోడేలు ఆశ

*అడవి జంతువుల చేత మాట్లాడించటం అన్న ప్రక్రియలో అనంతమైన శక్తి ఉన్నదనిపిస్తుంది, ఈలాంటి కథల్ని చూస్తే. వీటిలో జంతువులు తత్వాన్ని చెబుతాయి, నీతిని బోధిస్తాయి, తెలివిని పెంచుతాయి, వినోదాన్నిస్తాయి, మానవతను తెలియజేస్తాయి. ఈ కథ "తోడేలు ఆశ" మానవనైజంలోని ఏవో కోణాలను స్పృశిస్తున్నది. చదవండి:*

*రచన: M. రోజ, ఎనిమిదో తరగతి, ??? బడి, ??? ఊరు.*

అనగనగా ఒక ఊరు. ఆ ఊరికి సమీపంలోనే ఒక అడవి ఉండేది. ఊరికి చివర్లో ఒక చిన్న ఇల్లు ఉండేది. అందులో ఒక ముసలమ్మా, ఆమె ముద్దుల మనవడూ ఉండేవారు.



ముసలమ్మ మనవడు, రోజూ బాగా అల్లరి చేసేవాడు. ఒకనాటి రాత్రి వాడట్లా అల్లరి చేస్తుండగా, కోపమొచ్చిన ముసలమ్మ అన్నది: "ఒరేయ్! మనవడా! నువ్విట్లా అల్లరి చేశావంటే నేను నిన్ను తోడేలుకు ఇచ్చేస్తా" అని. సరిగ్గా అదే సమయానికి ఒక తోడేలు వచ్చి వాళ్ళ చూరు క్రింద నక్కి ఉన్నది. అది ఈ మాటలు విని చాలా సంతోషపడ్డది.

వెంటనే బయటికి వచ్చి "ఓ అవ్వా! నేను తోడేలును వచ్చాను. నువ్వు నీ మనవడిని నాకివ్వాలనుకుంటున్నావుగా! ఇచ్చెయ్యి తొందరగా." అన్నది.

తోడేలును చూసిన అవ్వ "నీకు నా ముద్దుల మనవడే కావల్సివచ్చిందా? ఆగు నీ పని చెబుతాను" అని కొట్టంలో కట్టేసిన వేటకుక్కను తోడేలు మీదకి వదిలింది. వేటకుక్క వెంటపడటంతో తోకముడిచిన తోడేలు పారిపోతూ అనుకున్నది: "ఈ మనుషుల్ని నమ్మటానికి లేదు. వీళ్లు చెప్పేది ఒకటీ, చేసేది మరొకటీ!" అని.

# దయ్యం

*ప్రకృతి బడిలో 8వ తరగతి చదువుతున్న పి. సయ్యద్ రాసిన కథ, 'దయ్యం'. "భయపడేవాడు శాస్త్రాన్ని చెప్పగలడుగానీ పరీక్షించి నిజానిజాలు తేల్చలేడు" అని చెప్పే ఈ కథ పెద్దల్ని కూడా రంజింపచేయగలదని మాకు అనిపించింది.*



అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఇద్దరు బాల మిత్రులు. రాము, సోము వారి పేర్లు. ఒక సారి రాము, తనకు కావాల్సిన నోటుపుస్తకం ఒకదాన్ని సోము దగ్గరినుండి ఇప్పించుకున్నాడు. తీసుకున్న నోట్సును సోముకి తిరిగి ఇవ్వడానికి రాత్రి సమయంలో వెళ్ళాడు.

రాత్రిపూట ఒంటరిగా తమ ఇంటికొచ్చిన రాముతో సోము అన్నాడట, "ఒరేయ్ రామూ! ఇంత రాత్రిలో ఒంటరిగా వచ్చావా? ఇలాగ ఇంకెప్పుడూ రాకురా!" అని. అప్పుడు రాము "ఎందుకు సోమూ?" అని అడిగాడట. "రాత్రి వేళల్లో దయ్యాలు తిరుగుతాయిరా! అందుకనే రాత్రిపూట తిరగరాదు" అన్నాడట సోము. "ఏంటీ, దెయ్యాలా! అవెక్కడుంటాయి రా?" అనడిగాడట రాము. "అవా! అదిగో ఆ చింత చెట్లమీదుంటాయి" అని రెండు చింత చెట్లను చూపించాడట సోము. అది విన్న రాము గట్టిగా నవ్వి, "దెయ్యాలూ లేవు, భూతాలూ లేవు" అన్నాడట. కానీ సోము మాత్రం ఒప్పుకోలేదట. పైగా "నీకు దెయ్యాలు లేవని నమ్మకం ఉంటే రేపు రాత్రికి వెళ్ళి ఆ చింతచెట్టు కొమ్మ మీద ఒక మేకు కొట్టిరా రామూ!" అన్నాడట. రాము సరే నన్నాడట. నిజానికి వాడికి కూడా దయ్యాలుంటాయేమోనని అనుమానమే. కాని పైకి మాత్రం లేని గాంభీర్యం నటించాడు అంతే.

మరునాడు అమావాస్య. రాము మిత్రునికిచ్చిన మాట ప్రకారం ఆ రాత్రికి ఒక మేకు తీసుకొని, సోము చూపించిన చెట్టు దగ్గరకు వెళ్ళాడు. భయం భయంగానే చెట్టును ఎక్కాడు. అత్రంగా మేకును చెట్టుకు కొట్టబోయాడు. బదులుగా దాన్ని తన ప్యాంటుమీదనే కొట్టుకున్నాడు. ఇక దిగి రావాలని ప్రయత్నించిన రాముకి తన కాలినేదో పట్టుకున్నట్టుగా అనిపించింది. చీకటి మాపున ఆ పట్టుకున్నదేమిటో తెలియలేదు. నిజంగానే దయ్యం పట్టుకున్నదనిపించింది వాడికి. ఉన్న ధైర్యం కాస్తా ఆవిరైపోయింది. మనస్సునంతా భయం ఆవరించింది. ఆ భయంతోనే వణికిపోయాడు. కొమ్మపైనుండి కిందికి పడి, కాళ్ళు చేతులు విరగగొట్టుకున్నాడు.

అనుమానం ప్రాణ సంకటం. ఏ పనినైనా చెయ్యాలంటే ధైర్యంగా చేయాలి. భయపడుతూ చేసిన పనులు సజావుగా కాకపోవటంలో ఆశ్చర్యమేమున్నది?

# ఏడు చేపల కథ

*రచన: కవిత. పేరు మాత్రమే తెలిసింది. బహుశ: ఎవరో చిన్న పాపే అయి ఉంటుంది. లేకపోతే ఈ కథ రాయాలని ఎందుకు అనిపిస్తుంది?*

*అమ్మమ్మల సమయం నుండి తెలుగు పిల్లలందరికీ చెప్పుకుంటూ వస్తున్న ఏడు చేపల కథని మేం ఎన్నడూ చదివి ఉండలేదు. కవిత ఈ కథని పంపితే, ముచ్చట పడి ఈ సంచికలో ముద్రిస్తున్నాం- మీరూ చదివి సంతోషపడాలని.*



అనగనగా ఒక రాజ్యం ఉండేదట. ఆ రాజ్యానికో రాజు. రాజుకు ఏడుగురు కొడుకులుండేవారట.

ఒకసారి రాజుగారి ఏడుగురు కొడుకులూ, చేపల వేటకని బయలుదేరి వెళ్ళారట. ఏడుగురు కొడుకులూ కలసి ఏడుచేపలు పట్టారట. పట్టుకొచ్చిన ఏడుచేపలనూ ఒక బండ మీద ఆరబెట్టారట.

అందులో పెద్దవాడి చేప మాత్రం ఎండలేదట. పెద్దకొడుకు చేపతో, చేపా! చేపా! ఎందుకెండలేదు? అని అడిగాడట. అందుకు బదులుగా ఆ ఎండబెట్టిన చేప, " గడ్డివాము అడ్డం వచ్చింది, అందుకనే ఎండలేదు" అని చెప్పిందట.

రాకుమారుడు గడ్డివాము దగ్గరికెళ్ళి దానితో, "గడ్డివామూ! గడ్డివామూ! ఎందుకు అడ్డం వచ్చావు?" అని అడిగాడట. అప్పుడా గడ్డివాము "ఆవు నన్ను మేయలేదు" అని అన్నదట.

ఈసారి రాకుమారుడు ఆవు దగ్గరికెళ్ళి "ఆవూ! ఆవూ! నువ్వెందుకు గడ్డి మేయలేదు?" అని అడిగాడట. అప్పుడా ఆవు, "జీతగాడు నాకు మేత వేయలేదు" అని చెప్పిందట.

"జీతగాడా! జీతగాడా! నువ్వెందుకు మేత వేయలేదు?" అని అడిగాడట. " అవ్వనాకు బువ్వ పెట్టలేదు" అని జీతగాడు చెప్పాడట.

"అవ్వా! అవ్వా! జీతగానికి ఎందుకు బువ్వ పెట్టలేదు?" అని అడిగాడట రాకుమారుడు. " పాప ఏడుస్తోంది. అందుకనే నాకు వీలుకాలేదు" అని అవ్వ చెప్పిందట.

"పాపా! పాపా! ఎందుకు ఏడుస్తున్నావు?" అని పాపనడిగాడట రాకుమారుడు. "నన్ను చీమ కుట్టింది" అని పాప అన్నదట.

రాకుమారుడు చీమను వెళ్ళి అడిగాడట, "చీమా! చీమా! ఎందుకు పాపను కుట్టావు?"అని. అప్పుడు చీమ అన్నదట, "నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా! గిట్టనా!" అని.........!

# ప్రయత్నం

*రచన: టి.రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రకృతి బడి.*

నక్కల చెరువు ఒడ్డున దుబ్బకప్ప, బక్క కప్ప మిత్రులుగా ఉండేవి. ఆ రెండింటి ప్రవర్తనలోనూ, గుణగణాలలోనూ చాలా తేడా ఉండేది. దుబ్బకప్ప లావుగా, బలంగా, కానీ బద్ధకంగా ఉండేది. బక్క కప్ప చిన్నదిగా, నాజూకుగా, చురుకుగా, తెలివిగా ఉండేది. కప్పలు రెండూ ప్రతిరోజూ కలసి తమ కప్పల గుంపులో జరిగిన విషయాలనన్నింటిని గురించీ చర్చించుకొనేవి.

ఇలా ఉండగా, ఒక రోజు వర్షం బాగా కురిసింది. కప్ప మిత్రులిద్దరూ తేమలో చలాకీగా గెంతుతూ దగ్గరలోఉన్న ఊర్లోకి పోయాయి. పోతూపోతూ ఒక ఇంట్లోకి దూరాయి. ఇంట్లోకి వెళ్ళిన కప్పలు రెండూ, వంటగదిలోకి వెళ్ళి అక్కడున్న పాలపాత్రలోకి దూకేశాయి. ఆపాత్రలో సగంవరకూ పాలున్నాయి. పాలలోకి దూకిన కప్పలు బయటికి రావడానికి కొన్ని గంటలపాటు విశ్వప్రయత్నం చేశాయి కానీ పాత్ర నున్నగా ఉండటంచేత బయటకి రాలేకపోయాయి. దుబ్బకప్పేమో ఎగిరీ, ఎగిరీ అలసిపోయి, నిరాశా నిస్పృహలకు లోనై ఇక చావేగతనుకొంది. పైగా "ఒసే బక్కదానా! ఈకష్టం నావల్ల కాదే! ఎంత ఈదినా, ఎంత గెంతినా మనం ఈ పాత్రనుండీ బయట పడలేము. ఇక మనకు పరలోకమేగతి. కాబట్టి నువ్వుకూడా ఇక ఈదడం ఆపెయ్యి. ఎలాగూ చావబోతున్నాము. ఇక ఈ చివరి క్షణాలలో ఇంతంగా కష్టపడి చచ్చేకంటే, ఊరికే చచ్చేది నయంకదా!" అని అయాసంగా అన్నది, నిట్టూరుస్తూ.



ఆ మాటలు విన్న బక్కకప్ప తన మిత్రుడైన దుబ్బ కప్పతో, "చూడు మిత్రమా! కష్టాలు వచ్చినంతలోనే ఇంతగా నిరుత్సాహపడిపోవడం సమంజసం కాదు. అపాయంనుండీ బయటపడే మార్గం మనకు మనమే సృష్టించుకోగలగాలి. అందుకోసం కష్టపడాలికానీ, పిరికివానిలాగా అధైర్యపడిపోకూడదు. అనుకున్నది సాదించే వరకూ పని చేయాలి. ఇదే నా నిర్ణయం. అని తను పాత్రలోనుండీ బయటకుదూకే ప్రయత్నం కొనసాగించింది. చాలాసేపు అలా పాలలో ఈదీఈదీ బక్కకప్పకూడా అలసిపోయింది. కాళ్ళన్నీ నొప్పిపుట్టినా కూడా అది తన ప్రయత్నాన్ని ఆపలేదు. కొంచెం సేదతీరి, అలసట తగ్గగానే మళ్ళీ ఈదటం కొనసాగించింది.

అప్పుడు దుబ్బ కప్ప, "ఏమే బక్కదానా! ఇంకా ఎగరలేదేమిటి? ఎగురూ! ఎగురమ్మా " అని గేలిచేస్తూ, ఎగతాళిగా మాట్లాడింది. బక్కకప్పకు కోపంవచ్చింది. "చచ్చి సాధించేమీ లేదు. బ్రతికున్నంతవరకే ఏదైనా చేయగలము. ప్రయత్నాన్ని విరమించుకొని మధ్యలోనే చావడం పిరికివాని లక్షణం. కష్టపడితే ఫలితం తప్పకుండా లభిస్తుంది. అంతవరకూ ప్రయత్నాన్ని ఆపకూడదు" అని అన్నది.

అదివిన్న దుబ్బకప్ప, ఏదో, బక్కకప్ప కోసం పనిచేస్తున్నట్టుగా చివరి ప్రయత్నాన్ని చేసింది, కానీ మనసులేని చోట శరీరం సహకరించకపోవటం వల్ల, కాసేపటికి అది అలిసిపోయి, గుండె పగిలి చనిపోయింది.

మిత్రుని మరణం ఒకవైపు, విపత్కర పరిస్థితి మరొకవైపు! బాగా అలసిపోయిన బక్కకప్ప 'ఇక తనవంతూ వచ్చేసిందా' అనుకొంటుండగా, దాని కాళ్ళకింద ఏదో గట్టిగా తగిలినట్లనిపించింది. ఆశ్చర్యం! దానికాళ్ళకింద ఒక పెద్ద వెన్నముద్ద వచ్చి దాన్ని పైకి లేపుతోంది. బక్క కప్ప సంతోషానికి అవధులులేవు. తనబలాన్నంతా కూడగట్టుకొని, గట్టిపడిన వెన్నముద్దమీదినుండి బయటికి గెంతి, పాత్రనుండీ బయట పడింది. దాని కష్టానికి మంచి ఫలితం లభించింది. అందుకే అన్నారు, "కష్టే ఫలి " అని.

కష్టాలు వచ్చినప్పుడు, కుంగిపోతే లాభం లేదు. మన శక్తి కొద్దీ ప్రయత్నాన్ని నిరంతరంగా కొనసాగించాలి. ప్రయోజనం కలిగినా సరే, కలగకున్నా సరే. ప్రయత్నం ముఖ్యం, ఫలితం కంటే.

# మంగలి-బ్రహ్మరాక్షసుడు

*అనువాద రచన: నారాయణ*

*మూలం: Folk tales from India by Late A.K.Ramanujan*

చాలా కాలం క్రితం బెంగాల్ రాష్ట్రంలోని బర్దవాన్ జిల్లాలోని ఓ మంగలి నివసించేవాడు. అతనికి ఏ పనీ సరిగ్గా చేయటం రాదు. ఎప్పుడూ తనపెట్టెలో ఉన్న పగిలిపోయిన అద్దాన్ని చూసుకుంటూ, పళ్లు విరిగిపోయిన పాత దువ్వెనతో దువ్వుకుంటూ కాలం గడిపేవాడు. అతని భార్య, ముసలి తల్లి రోజంతా అతన్ని దుయ్యబెట్టేవారు. కాని వారి తిట్లు అతన్ని ఏమీ చేయలేకపోయాయి. చివరికి ఒకరోజున విసిగి వేసారిన తల్లి అతన్ని చీపురు కట్టెతో జాడించింది. చిన్నబుచ్చుకున్న మంగలి ఇల్లు వదలి బయలుదేరాడు. డబ్బు సంపాదించేంతవరకూ ఇక ఇంటి ముఖం చూడకూడదనుకున్నాడు.

అలా నడచీ నడచీ మంగలి ఒక అడవి చేరుకున్నాడు. అక్కడ "ఏ చెట్టుకిందో కూర్చొని తపస్సు చేద్దాం" అనుకున్నాడు. కానీ అతడు

కొంచెంసేపు గడచింది. రాక్షసుడు నాట్యం ఆపేటట్లు లేడు. మంగలికి అలుపు వస్తున్నది. వాడు రాక్షసుడిని అడిగాడు. - " నువ్వెందుకు నాట్యం చేస్తున్నావు? నీకంత ఆనందం ఎందుకు కలిగింది? అని.

రాక్షసుడు పెద్దగానవ్వి చెప్పాడు - "నేను ఈ ప్రశ్న కోసమే ఎదురుచూస్తున్నానురా, మానవా! నాకు తెలుసు, నువ్వు ఒట్టి మూర్ఖుడివి, నీకు కారణం తెలియదని. నీమెత్తని మాంసం నా నాలుకకు ఎంత విందు చేయనున్నదో తలచుకుంటే నాకు కాళ్ళూ, చేతులూ ఆగనంత ఆనందమయి, నాట్యం చేస్తున్నాను. మరిప్పుడు చెప్పు - నువ్వెందుకు నాట్యం ఆడుతున్నావు?"



"నా నాట్యానికి ఇంకా గొప్ప కారణం ఉన్నది." అన్నాడు మంగలి- మాటకు మాట చెప్పాలని. "మా రాజకుమారునికి ఆరోగ్యం అస్సలు సరిగ్గాలేదు. అతడి ఆరోగ్యం బాగవ్వాలంటే నూటొక్కమంది బ్రహ్మరాక్షసుల గుండె రక్తం కావాలని వైద్యులు సెలవిచ్చారు. అలా నూటొక్క బ్రహ్మరాక్షసుల గుండె రక్తం తెచ్చిఇచ్చిన వారికి అర్ధరాజ్యాన్ని, రాకుమారినీ ఇస్తానని రాజుగారు చాటింపువేశారు. నేను ఇప్పటికి అతి కష్టం మీద నూరుమంది బ్రహ్మరాక్షసులను పట్టుకోగలిగాను. ఇప్పుడు నువ్వు, నూటఒకటోవానివి, దొరికావు. నీతో నాకు కావలసిన నూటఒక్కమందీ పూర్తయ్యారు. నేను ఈ సరికే నీఆత్మను చేజిక్కించుకున్నాను. ఇక నువ్వు నాజేబులోంచి తప్పించుకోలేవు". ఇలా అంటూనే వాడుతన జేబులోంచి అద్దాన్ని తీసి రాక్షసునికి చూపించాడు. భయంతో వణకిపోతున్న ఆ బ్రహ్మరాక్షసునికి తన ప్రతిబింబమే ఆ అద్దంలో కనిపించింది. స్వచ్ఛంగా కాస్తున్న పండు వెన్నెలలో, ఆ అద్దంలో తళతళ మెరుస్తున్న తన ముఖం చూసి రాక్షసుడు తను నిజంగానే పట్టుబడ్డానేమోననుకొన్నాడు. కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోతూ వాడు, తనని వదలిపెట్టమని మంగలి కాళ్ళమీద పడ్డాడు.

మంగలి బెట్టుచేశాడు. ఒప్పుకోలేదు. కానీ బ్రహ్మరాక్షసుడు చివరికి ఏడుగురు రాజులకుండేంత బంగారాన్ని ఇస్తానని ఆశ చూపించాక, అయిష్టంగానే మెత్తబడుతున్నట్లు నటిస్తూ, చివరికి ఒప్పుకున్నాడు. "కానీ నువ్వనే ఈ బంగారం ఎక్కడుంది? దాని ఈ అర్థ రాత్రి పూట మా ఇంటివరకూ ఎవరు మోస్తారు?" అన్నాడు వాడు.

"నీవెనుక ఉన్న చెట్టు మొదట్లోనే ఉంది బంగారం అంతా." అన్నాడు బ్రహ్మరాక్షసుడు. "నేను దానిని తవ్విపెట్టడమే కాదు, మీ ఇంటిలోనికి స్వయంగా మోసుకొచ్చి చేరుస్తాను ఒక్క క్షణంలో. మా బ్రహ్మరాక్షసులకు ఇలాంటి ప్రత్యేక శక్తులుంటాయి." అని చెప్పి, మాట ప్రకారం వాడు ఆ వృక్షాన్ని పెకిలించి దాని అడుగున ఉన్న బంగారాన్నంతా బయటికి తీశాడు. అంత సంపదను చూసి మంగలి నోరు వెళ్ళబెట్టేవాడే: కానీ తనను తాను సంబాళించుకొని, ధైర్యంగా ఆ సంపదనూ, తననూ, ఇల్లు చేర్చమని ఆజ్ఞాపించాడు. బ్రహ్మరాక్షడు తన శక్తితో మరుక్షణంలో మంగలినీ, సంపదనూ ఇల్లుచేర్చాడు. ఆ తర్వాతనైనా తనని వదిలిపెట్టమని వాడు మంగలిని కాళ్ళా వేళ్ళాపడ్డాడు. కానీ మంగలి, వాడిని అంత త్వరగా

వదిలిపెట్టదలుచుకోలేదు. తన పొలంలోని వరి పంటనంతా కోసి ఇంటికి తెచ్చి పెట్టమన్నాడు. తనను తాను బందీగా భావించుకొంటున్న బ్రహ్మరాక్షసుడు ఇక కిక్కురుమనకుండా పనిలోకి దిగాడు.

అతను వరిపొలంలోకి దిగి పనితో సతమతమౌతుండగా, మరో బ్రహ్మరాక్షసుడు వాడిని చూసి, గుర్తుపట్టి, పలకరించాడు. " ఏం చేస్తున్నావని " అడిగాడు. మొదటిరాక్షసుడు తనెలా ఈ మోసకారి మనిషి కదంబ హస్తాలలో చిక్కుకున్నదీ, తను పని చెయ్యకపోతే తనకి వాడినుండి విముక్తి ఎలా లభించనిదీ చెప్పుకొని బావురుమన్నాడు. రెండో రాక్షసుడు పరిహాసంగా నవ్వి - " అరే, నీకేమైంది స్నేహితుడా? మనం మనుషులకంటే ఎన్నోరెట్లు అధికులం. ఎన్నో రెట్లు శక్తివంతులం. మనిషికి మనపై అధికారం ఎలా ఉంటుంది? నాకా మనిషి ఇల్లు చూపించు. నేను వాడి పనిపడతాను " అన్నాడు.

" నీకు ఇల్లు చూపించడం వరకూ చేయగలను. కానీ దూరంనుండే. ఈ వరి పొలం పని పూర్తయ్యేంతవరకూ నా మొహం అతనికి చూపించలేను " అంటూ, మంగలి ఇంటికి దారి చూపించాడు మొదటి బ్రహ్మరాక్షసుడు.

ఆలోపల మంగలి ఇంట్లో పండగ వాతావరణం నెలకొని ఉన్నది. పండగ వంటకోసం మంగలి ఒక పెద్దచేపను కొనుక్కొచ్చాడు - అయితే దురదృష్టవశాత్తూ, వంటగది వెనక ఉన్న పగిలిన కిటికీలోంచి దూరి వచ్చిన దొంగపిల్లి ఒకటి, ఆ చేపను తినేసింది. మంగలి భార్యకు ఆ పిల్లిపైన చాలా కోపం వచ్చి , దాన్ని పట్టుకోనేందుకుగాను దాని వెంటపడింది. కానీ చురుకైన ఆ పిల్లి వచ్చిన దారినే ఉడాయించింది. అది మళ్ళీ అదేదారిన వస్తుందని ఊహించిన మంగలి భార్య, చేపల కత్తిని చేతబూని ఆ కిటికీ పక్కనే భైఠాయించింది.

ఇదేమీ తెలియని రెండో రాక్షసుడు,ఇంటిలోకి వెళ్ళేముందు ఓసారి తన స్నేహితుడిని బందీచేసిన మనిషి ముఖం ఎలా ఉంటుందో చూద్దామనుకొని, మెల్లగా తన బవిరి గడ్డపు ముఖాన్ని కిటికీ లోనికి దోపాడు. దొంగ పిల్లి కోసం కిటికీ పక్కనే కూర్చున్న మంగలి భార్య కసిగా కత్తిని కిందకు దింపటం, ఆ దెబ్బకు బ్రహ్మరాక్షసుడి ముక్కు తెగిపోవడం జరిగేందుకు ఒక్క క్షణంకూడా పట్టలేదు. బాధకొద్దీ, భయంకొద్దీ వాడు ఇక కనబడకుండా పారిపోయాడు. ముక్కులేని తన ముఖాన్ని మిత్రునికి చూపించడానికి వాడికి ఏమాత్రం ఇష్టం లేకపోయింది.

మనిషి పని పడతానని వెళ్ళిన రెండవ బ్రహ్మరాక్షసుడు ఎంతకీ తిరిగిరానిది చూసి, పొలంలో పనిచేస్తున్న రాక్షసుడిగుండె వేగం పెరిగింది. వాడు చకచకా పంటనంతా కోసేసాడు; గింజలు వేరుచేసాడు; ధాన్యాన్నంతా ఎత్తాడు; ఇక మంగలిని కలిసి, వాడు భయం భయంగానే, తనను ఇకనైనా వదిలిపెట్టమని ప్రాధేయపడ్డాడు, వేడుకొన్నాడు, బ్రతిమాలుకొన్నాడు.

తెలివైన మంగలి కాస్త జాలిని నటిస్తూ, "సరే నిన్ను విడుదల చేస్తున్నాను. కావాలంటే చూసుకో" అంటూ, ఈసారి అద్దాన్ని వెనక్కితిప్పి చూపించాడు. ఆతృతగా అందులోకి చూసిన బ్రహ్మరాక్షసునికి అందులో తన ముఖం కనిపించలేదు. తేలికపడ్డ మనసుతో వాడు మంగలికి కృతజ్ఞతలు చెప్పుకొని, సంతోషంగా తన దారిన తాను పోయాడు. మంగలికూడా తేలిక పడ్డాడు! అటుపైన వాడు పనిని బాగా నేర్చుకొని, తనకింద మరో ముగ్గురు పని వాళ్ళను పెట్టుకొని, తన వృత్తికీ న్యాయం చేశాడు!

# పొడవాటి గడ్డం

*అనువాద రచన: నారాయణ మూలం: ఎ.కె.రామానుజన్ గారు సేకరించిన folk tales from India.*

ఒక నాటి సాయత్రంపూట, అప్పుడప్పుడే చీకటి పడుతుండగా, ఒక కాజీగారు కూర్చొని ఎంతో భక్తిశ్రద్దలతో ఒక పురాతన గ్రంథాన్ని చదువుతున్నారు. అందులో ఒక వాక్యం అతన్ని కలచివేసి, ఇక అతన్ని ముందుకు పోనివ్వలేదు: " పొడవాటి గడ్డంఉన్న మనుషులు సాదారణంగా తెలివితక్కువ వాళ్ళే అయి ఉంటారు ".

కాజీగారికి శోభ ఆయనకున్న గడ్డమే. నగరంరంలో అందరికంటే పొడవాటి గడ్డం ఆయనదే. 'తను విజ్ఞాన ఖని అని, తను చెప్పే న్యాయం తిరుగులేనిదనీ, తను చాలా తెలివైన వాడు' అనీ అందరూ అనుకోవాలని అతని ఆశ. కానీ ఇప్పుడు ఆశలన్నీ కుప్పకూలాయి! అందరూ తన గడ్డాన్ని చూసి, తనెంత తెలివి తక్కువవాడో చెప్పుకుంటారు. ఈ ఆలొచనే ఆయనకు కంపరం కలిగించింది.



అంతలో అతని చూపు పక్కనే ఉన్న నూనె దీపంమీద పడింది. ఇక వేరే ఆలోచనేమీ లేకుండా, అతను తన గడ్డాన్నంతా పిడికిట పట్టి, దాని చివరకు నిప్పంటించేసుకున్నాడు. అలాగైనా తన గడ్డం చిన్నదైపోతే అంతే చాలునని.

అతని గడ్డం పొడవుగా, చిక్కగా, సిల్కు మాదిరి ఉంటుంది. నిప్పంటించగానే అది అంటుకున్నది. ఒక్క సారిగా మంట పెద్దదయింది. కాజీగారి చేతులు కాలాయి. దాంతో ఆయన తన చేతులు వదిలిపెట్టాల్సి వచ్చింది. ఇక మంటకి అడ్డులేదు! అది ఇంకా పైకి ఎగిసింది. గడ్డాన్ని పూర్తిగా కాల్చేసి, మీసాల్ని, కను బొమ్మల్నీ కాల్చేసింది. ఇక ఆపైన తల జుట్టుకూడా అంటుకున్నది!

ఇప్పుడు అర్థమయింది కాజీగారికి - ' పొడవాటి గడ్డాలున్న వాళ్ళకి తెలివి తేటలు తక్కువేనని!

# నక్క-తాబేలు

*A.K.రామానుజన్ సేకరించిన మళయాళ జానపద కథ ఇది. చిన్నచిన్నమార్పులతో ఈ కథ మీకూ తెలిసే ఉంటుంది. మిత్రలాభాన్నీ, తెలివి తేటల అవసరాన్నీ చెప్పే ఇలాంటి కథలు బాల సాహిత్యంలో మనకు అనేకం దొరుకుతాయి. పిల్లలకూ అవి నచ్చుతాయి.*

ఓ చెరువులోని తాబేలు, దాని పక్కనేగల బొరియలో నివసించే నక్క మంచి స్నేహితులు.

ఓసారి అవి రెండూ చెరువుగట్టున కూర్చొని అవీ ఇవీ ముచ్చటించుకుంటున్నాయి. అంతలో అకస్మాత్తుగా అక్కడో చిరుతపులి ప్రత్యక్షమయింది.

నక్క మెరుపులాగా మాయమయింది. కానీ పాపం తాబేలుకు దాక్కునేందుకుగానీ, తప్పించుకునేందుకుగానీ సమయం చాలలేదు.



ఒక్క ఉదుటున దానిమీదకు దూకిన చిరుతపులి దాన్ని నోట్లో ఇరికించుకొని ఓ చెట్టుకిందికి పరిగెత్తింది. అక్కడ కూర్చొని మెల్లిగా తాబేలును తినవచ్చుననుకొన్నది. కానీ దాని పండ్లు కానీ, వాడియైన దాని పంజాగోర్లు కానీ తాబేలు పైపెంకుకు కనీసం గాటు కూడా పెట్టలేకపోయాయి.

తన బొరియలోంచి చిరుతపులి పడుతున్న కష్టాల్ని గమనించింది నక్క. తన మిత్రుడైన ఆ తాబేలును కాపాడుకొనేందుకు దానికో ఉపాయం తట్టింది. అది మెల్లగా బయటకు వచ్చి లేని గౌరవాన్ని నటిస్తూ చిరుతపులి ముందు అమాయకంగా నిలబడింది. "దీని పెంకును మెత్త బరిచే మార్గం ఒకటి నాకు తెలుసు. దీన్ని కొంతసేపు నీళ్ళలో పడేసి నాననియ్యి. ఆ తరువాత దీన్ని సులభంగా తీసేయవచ్చు" అన్నది.

వెర్రి చిరుతపులికి ఈ ఆలోచన నచ్చింది. అది అన్నది: " భలే ఆలోచన! నాకింతవరకూ తట్టనేలేదు!" అని అది తాబేలును చెరువులోకి జారవిడచింది. తాబేలుకు ఇంకేమికావాలి? అది మరుక్షణంలో మాయమై తప్పించుకున్నది.

చిరుతపులి తిరిగి చూసేసరికి నక్క కూడా మాయం!

# దున్నపోతుల కథ

*మీకు దున్నపోతులు ఎప్పుడూ ఎందుకు పని చేస్తూ ఉంటాయో తెలుసా? అవి బురదలో ఎందుకు పొర్లుతూ ఉంటాయో తెలుసా? ఈ కథ చదవండి తెలుస్తుంది.*

*మూలం: వియత్నాం జానపద కథలు*
*స్వేచ్ఛానువాదం: ఆనంద్*

చాలా కాలం క్రితం దున్నపోతులు కూడా అడవిలోనే నివసించేవి. అవి చాలా బద్దకంగా ఉండేవి, ఇతర జంతువులు తయారుచేసిన దారుల్ని వాడుకుంటూ ఉండేవి. ఇతర జంతువుల గడ్డిని దొంగతనంగా తినేవి, వాళ్ళ నీళ్ళన్నీ త్రాగేసేవి. అయితే అవి నీళ్లు త్రాగేవే కానీ ఎన్నడూ స్నానం మాత్రం చేసేవి కాదు. వాటికి తడవటమంటే అసలు ఇష్టం ఉండేదే కాదు, వానాకాలం వచ్చిందంటే చాలు- వానలో తడవకుండా ఉండటానికని ఎక్కడెక్కడికో వెళ్ళి దాక్కొనేవి. అవి శుభ్రంగా లేకపోయినా, కంపుకొడుతూ ఉన్నా, చూడటానికి మాత్రం చాలా అందంగా ఉండేవి. వాటి కొమ్ములు పొడుగ్గా వంపుతిరిగి ఉండేవి. వాటి శరీరం కూడా సున్నితంగా కండలతో బలిసి ఉండేది.



మిగిలిన జంతువులు వీటి బలానికి భయపడి, వీటి కంపు భరించలేక వీటి నుండి దూరంగా ఉండేవి. కానీ ఒక సారి జంతువుల నెలసరి సమావేశంలో ఎవరో దున్నపోతుల గురించి పిర్యాదు చేసారు. అప్పుడు ఆ సమావేశానికి నాయకుడైన ఏనుగు అన్నది, "ఇప్పటికే ఆ జంతువులను చాల రోజులు భరించాము. ఇక చాలు. ఇప్పుడు ఇక ఆ జంతువుల గురించి ఏదైనా చేసే సమయం ఆసన్నమయింది అనుకుంటున్నాను, మీరందరూ ఏమంటారు?" అని. చాల మంది చాలా ఉపాయాలు, అభిప్రాయాలూ చెప్పినా, ఒక దుప్పి చెప్పినదే అన్నింట్లోకి బాగుంది. దుప్పి ఏమి చెప్పిందంటే, "మనలో బలంగా ఉండే పులి గారిని మన ప్రతినిధిగా నియమిద్దాం. పులి వెళ్లి దున్నపోతులకి స్నానం చేస్తూ ఉండమని, ఇతరుల తిండి తినకుండా ఉండమని, ఇతరుల నీళ్లు తాగకుండా ఉండమని, అందరూ కలసి చేసే పనుల్లో పాలుపంచుకొమ్మనీ చెప్పాలి. అయినా అవి వినక పోతే వాటిని అడవిలోంచి తరిమేద్దాం."

అప్పుడు పులి దున్నపోతుల కోసం వెతుక్కుంటూ వెళ్లి, అవి కనిపించ గానే భయంతో ఒక చెట్టెక్కి "ఓ దున్నపోతులారా, మీకు వినిపిస్తోందా?" అని అరిచింది. దున్నపోతులు ఆశ్చర్యంగా తల పైకి ఎత్తి చూసాయి. అప్పుడు ఒక పెద్ద దున్నపోతు "అవును మాకు వినిపిస్తోంది. ఎవరవు నీవు, నీకు ఏంకావాలి?" అని అడిగింది.

"నేను జంతువుల సమావేశం నుంచి ఒక సమాచారంతో వచ్చాను. మీరంతా మాతో కలసి పనిచేస్తూ ఉండాలని, గడ్డి తీసుకురావటం లో మాకు అందరికీ సహాయం చేస్తూ ఉండాలని, ప్రతిరోజూ స్నానం చేస్తూ ఉండాలని మేము అనుకుంటున్నాము. మీరు అలా ఉండకపోతే ఈ అడవిలో ఉండకూడదు" అని చెట్టు మీద ఉన్న పులి అన్నది.

అది విన్న వెంటనే పెద్ద దున్నపోతు వెటకారంగా నవ్వి, "పోరా! మీకు నచ్చక పోతే, మీరే వేరే ఎక్కడికైనా వెళ్ళండి. మేము సామాన్య జంతువులం కాదు, చాలా బలవంతులం. మేము ఏమి చేయాలో మాకు ఎవ్వరూ చెప్పనవసరం లేదు. మాతో ఇంకోసారి పెట్టుకుంటే మిమ్మల్నందరినీ నాశనం చేస్తాం." అని అంది.

పులి సమావేశానికి తిరిగి వచ్చి ఈ విషయం చెప్పింది. జంతువులన్నీ ఈ విషయం గురించి చర్చించటం మొదలు పెట్టాయి. అప్పుడు ఏనుగు నిశ్శబ్దంగా వుండమనటానికి సూచనగా డోలు మోగించి "స్నేహితులారా, మనం ఏమి చేయాలో చెప్పమని దేవుడిని ప్రార్థిద్దాం" అన్నది. వాళ్లు అందరూ ప్రార్ధన చేశారు. అంతా నిశ్శబ్దంగా వుంది. అప్పుడు ఎక్కడినుంచో ఒక అదృశ్యవాణి వినపడింది: "జంతువులారా! మీరు చేసింది సమంజసమే. దున్నపోతులు చాలకాలం నుండీ తప్పులు చేస్తూ వున్నాయి. అ తప్పుల్ని సరి దిద్దుకునేందుకు కూడా ఏమాత్రం ప్రయత్నం చేయట్లేదు . వాటికి శిక్ష పడాల్సిందే. పులులన్నీ వెళ్లి దున్నపోతుల గుంపుపై దాడి చేయాలి." అని అన్నది.

## కొత్తపల్లి అక్టోబర్ 2008

పులులన్నీ దాడి చేయటానికి బయలుదేరాయి. దున్నపోతుల గుంపు కనిపించగానే ముందే వేసుకున్న పథకం ప్రకారం దాడిని మొదలు పెట్టాయి. ఆ పోరాటంలో ఒక్క పులి కూడా గాయపడలేదు కానీ దున్నపోతుల పరిస్థితి మాత్రం ఘోరంగా అయిపోయింది. వాటి అందమయిన కొమ్ములన్నీ వెనక్కి వంగి పోయాయి. ఒళ్ళంతా గాయాలయ్యాయి. చాలా దున్నపోతులు చచ్చిపోయాయి. చావకుండా బ్రతికి ఉన్న దున్నపోతులన్నీ ఒక ఏరు వద్దకు చేరుకొని, నీళ్ళలో పడుకొని, గాయాలను మాన్పుకున్నాయి. అవి కోలుకునేందుకు కొన్ని రోజులు పట్టింది. తిరిగి బలం పుంజుకున్న తరువాత, ఏమి చెయ్యాలో నిర్ణయించు కోవటానికి అవి సమావేశమయ్యాయి. ముసలివి, తెలివైన దున్నపోతులన్నీ 'ఇక్కడి నుంచి దూరంగా వెళ్ళిపోతే బాగుంటుంద" అని అంటే',కుర్ర దున్నపోతులన్నీ 'ఇక్కడే ఉండి జంతువులతో పోరాడాలి" అన్నాయి. దున్నపోతులన్నీ ఇలా వాదించుకుంటూ ఉంటే, అంతకుముందు ఇతర జంతువులకు వినిపించిన అదృశ్య వాణి వినబడి ఇలా శపించింది: "మీరు చేసిన తప్పులకు మీకు శిక్ష పడింది. కానీ ఇది శిక్షలో ఒక భాగం మాత్రమే. మీ అందానికి గర్వపడినందుకుగాను మీరు వికారంగా తయారగుదురు గాక. శుభ్రంగా లేనందుకుగాను బురదలో పొర్లుతూ ఉందురు గాక. దగ్గరలోని గ్రామాలకు వెళ్లి అక్కడ రైతులతో ఉండి, వాళ్ల పొలాలు దున్నుతూ ఉండిపోదురు గాక."

అప్పటి నుండి దున్నపోతులన్నీ వికారంగా తయారయ్యాయి. వాటి కొమ్ములు దేనికీ పనికిరాకుండా పోయాయి. అప్పటినుండి అవి బురదలో పొర్లుతూ, పొలాలు దున్నుతూ ఉండిపోయాయి.

# కథల కథ

*కథలకు సందర్భాలు కావాలి. మీలోని కథలకు కొత్తపల్లి పత్రిక ఓ చక్కని సందర్భం అవ్వాలని మా ఆశ. పిల్లల కథలన్నిటికీ మా హార్దిక స్వాగతం. వాటిని విరివిగా పంపండి. వీలు చూసుకొని ప్రచురించగలం.*

*మీరు పిల్లలైతే మరీ మంచిది! మరింత తొందరగా ప్రచురిస్తాం.*

*రచనలు పంపవలసిన చిరునామా:*

*కొత్తపల్లి బృందం,*
*C/o ప్రకృతి బడి,*
*టింబక్టు కలెక్టివ్,*
*చెన్నేకొత్తపల్లి,*
*అనంతపురం జిల్లా- 515 101*
*ఇ-మెయిలు: team@kottapalli.in*

ఒక అడవిలో ఒక కుందేలుండేది. ఆ కుందేలు ఎప్పుడూ సంతోషంగా ఎగురుతూ,నవ్వుతూ ఉండేది. అడవిలో ఎవరు ఎదురైతే వాళ్ళకు ఓ కథ చెప్పుకుంటూ ఉల్లాసంగా జీవించేది. ఒకసారి దానికి జ్వరం వచ్చింది. జ్వరం వస్తే, పాపం అది ఊరికే పడుకొని ఉండిపోయింది. చుట్టూతా ఎవరున్నారన్న ధ్యాసే దానికి లేకుండా పడిపోయింది. చివరికి కుందేలు బంధువులు పట్టుబట్టి దాన్ని డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళారు. డాక్టరుగారు దాన్ని పరీక్షించి ఏవేవో గోలీలు రాసిచ్చారు. బంధువులు బలవంతంగా కొన్ని మాత్రలు దానిచేత మింగించారు, వద్దన్నా వినకుండా. వాటితో మూడోరోజుకల్లా కుందేలుకు జ్వరం తగ్గిపోయింది. కానీ దాని మనసుకు ఏమైందో, మరి, ఇప్పుడు అది పూర్తిగా నిశ్శబ్దం అయిపోయింది. ఆ కథలన్నీ ఎటుపోయాయో, ఏమో? ఒక్కటీ లేకుండా మాయమయ్యాయి!

ఇక కుందేలు ఆగలేకపోయింది. తప్పిపోయిన ఆ కథల్ని వెతుక్కుంటూ అడవిలో అంతా తిరిగేది. ఇదివరకు ఉన్న ఉత్సాహం, ఉల్లాసం ఇప్పుడు దానికి లేకుండా పోయాయి. ఊరికే "నాకథలు! నాకథలు" అని అరుచుకుంటూ పోయింది, పాపం. కానీ కథలు!- వాటిని రమ్మంటే వస్తాయా, పొమ్మంటే పోతాయా?- అవిమాత్రం పూర్తిగా ముఖం చాటు చేసుకున్నాయి.

అలా దారీ తెన్నూ లేకుండా తిరుగుతున్న కుందేలు చివరికి అడవి అంచున ఉన్న ఓ గుడిశ దగ్గరకు చేరుకున్నది. ఆ సమయానికి బాగా చీకటి పడింది. ఇంట్లో ఓ తల్లి బిడ్డను నిద్ర పొమ్మంటున్నది. బిడ్డ కథ చెప్పమంటున్నది. తల్లి 'పని ఒత్తిడి ఉన్నది- ఊరకుండమంటు'న్నది. బిడ్డ గునుస్తోంది. అటూ ఇటూ పొర్లు తున్నది. "కథ చెప్పాల్సిందే" నని పట్టుబడుతున్నది. చూరు క్రిందనున్న కుందేలుకు గుండె వేగంగా కొట్టుకున్నది. లోపల అలజడి ఎక్కువైంది. అంతలోనే దాని నోట్లోంచి అద్భుతమైన కథ ఒకటి ఊడిపడింది. అసంకల్పితంగా, అనాలోచితంగా, బిగ్గరగా కథ చెప్తున్న కుందేలుగానీ, ఆశ్చర్యపోతున్న తల్లిగానీ, నిద్రముంచుకొస్తున్న బిడ్డగానీ- ఎవ్వరూ గుర్తించలేదు- కుందేలు కథలు అసలు నిజానికి ఎక్కడికీ పోలేదు! కుందేలులోనే ఉన్నాయి! కొన్ని రోజులు ఊరికే నిద్రపోయాయంతే! మళ్ళీ అవసరం ఏర్పడే సరికి, మళ్ళీ అవకాశం వచ్చేసరికి, అవి తిరిగి వెల్లువయ్యాయి. తన నోట్లోంచి వస్తున్న కథ పూర్తవగానే కుందేలుకు ఈ సంగతి అర్థమైపోయింది. దాని మనసు తేలికైంది. మళ్ళీ దానిలో కథలు తయారవుతున్నాయిప్పుడు!

కథల తీరే అది. మన లోతుల్లోంచి ఎక్కడినుండో ఊడిపడుతుంటాయి అవి. కథలకూ తమవైన ప్రాణం ఉంటుంది. అవీ నవ్వుతాయి, ఏడుస్తాయి, వస్తాయి, పోతాయి. వాటికి తమదంటూ స్వేచ్ఛ ఒకటి ఉంటుంది. ఎవరైనా, ఎప్పుడైనా చెప్పేస్తామంటే రావు, కథలు. వాటికి ఇష్టమైతేనే వస్తాయి. ఇష్టం కాకపోతే గుర్తుకు రామంటాయి, వేరే పనుల్ని గుర్తుకు తెస్తాయి. ఒక్కోసారి అవి బయటికి రాకపోతే కంగారు పడకండి. సరైన సమయం, సందర్భం రాగానే అవి తప్పక వెలువడతాయి!

# రామాలాలి

*గానం: రామాంజనేయులు గాత్ర బృందం: భారతి, స్వాతి, షాహింతాజ్, పావని (పదవతరగతి) డప్పు: పోతలయ్య (ఏడవ తరగతి)*

*ఈ పాట పల్లవిలో 'రామరాజ్యమైన' అన్న పదం జనపదాల్లో భాగమైంది, అసంబద్ధంగా ఉన్నప్పటికీ. బాపు గారు*

*తీసిన సినిమాలో దీన్ని 'తామరస నయన' అన్నారు అర్ధవంతంగా. కానీ మీరు దీన్ని మీకిష్టమైనట్లు*

*పాడుకోవచ్చు! ఇక నాలుగో చరణంలో 'జోకొట్టి..' కాక మరేదైనా ఉండి, గతించిందేమో అనిపిస్తుంది.*



రామాలాలీ మేఘ శ్యామా లాలీ రామా
రామరాజ్యమైన దశరథ తనయాలాలీ

ఎంత ఎత్తు ఎదిగినావో ఏమి చేయుదుమో రామా
అందరి కన్నుల ముందర నీవు ముద్దుగ తిరిగేవో రామా
|రామాలాలీ|

అయోధ్య నగరమంతా అలంకరించేమో రామా
నీవు నడిచే బాటల్లోన మల్లెలు చల్లేమో రామా
|రామాలాలీ|

అడ్డమైన ఆటలు ఆడి అలసిపోతివో రామా
జో కొట్టి జోలలు పాడి నిద్దురపుచ్చేమో రామా
|రామాలాలీ|

బంగారు పట్టు శాలువ పైన కప్పేమో రామా
జోకొట్టి జోలలుపాడి నిద్దురపుచ్చేమో రామా
|రామాలాలీ|

# నా మనోహర

*గానం: రామాంజనేయులు బృంద గానం: స్వాతి, భారతి, షాహింతాజ్, పావని డప్పు: పోతలయ్య*

*సీత రాముని బంగారు లేడిని తెచ్చి ఇమ్మని కోరకపోతే రామాయణం లేదు. ఆ దృశ్యాన్ని మనోహరంగా చిత్రించిన మన జానపదులు ధన్యులు.*



నామనోహర రామచంద్రా నాదుకోర్కెను తీర్చుమా
పర్ణశాలకు వచ్చెను బంగారు లేడిని చూడుమా

సుందరంగా లేడి కన్నులు చుక్కలు కాబోలును
చెవులు శృంగారమ్ములు దాని కొమ్ములే విలునమ్ములు |నా మనోహర|

పదిలముగ బంగారులేడిని పట్టితెమ్ము మనోహరా
చిక్కకుండిన దాని చర్మము చీల్చితెమ్ము మనోహరా |నా మనోహర|

అదిగో చూడుము ప్రాణనాథ బెదరకను తానున్నది
పరుగులెత్తుతు పర్ణశాల చుట్టు తిరుగుతున్నది

పాలుపోసి పెంచుకుందు పసిబిడ్డవోలెను
అడవులకు మీరు పోయినపుడాటలాడు కుందును |నా మనోహర|

# శ్రీ గణనాయకా

*గానం: స్వాతి, పదో తరగతి బృంద గానం: రామాంజనేయులు( అయ్యవారు), భారతి, పావని, షాహింతాజ్(పదో తరగతి) డప్పు: పోతలయ్య*



శ్రీ గణనాయకా సిద్ధి వినాయకా
మ్రొక్కెద వరములివ్వు మోక్షదాయకా ||శ్రీ గణనాయకా||

విద్యకెల్ల గురువునీవె శ్రీ గణేశా
ముద్దుమోము చూపవోయి శ్రీ గణేశా
చదువుల గురువని మది నిను నమ్మితి
సతతము బ్రోవవయ్య శ్రీ వినాయకా ||శ్రీ గణనాయకా||

వ్యాస మహా మునీంద్రుని కోర్కె తీర్చినావు
భారతంబు వ్రాసి పేరుగాంచినావు
పార్వతి పుత్రుడివైన నిన్ను ప్రస్తుతి సేతును
వేడెద నిను మదిలో వేగ రావయా ||శ్రీ గణనాయకా||

లంకాధీశుని గర్వమణచినావు
అమరులకే ఆత్మలింగమిచ్చినావు
ధరణిలో కొత్తపల్లి దాసుడి నివాసమైన
కోరెద నిను మదిలో కరుణ చూడవా ||శ్రీ గణనాయకా||

# ఆన్నాఏడవకురా

*గానం: స్వాతి, పదో తరగతి*

*బృంద గానం: రామాంజనేయులు (అయ్యవారు), భారతి, పావని, షాహింతాజ్( పదో తరగతి)*

*డప్పు: పోతలయ్య, ఏడవ తరగతి*



అన్నా ఏడవ్వకురా లవ్వన్నా ఏడవ్వకురా
ఏడిస్తే నీ కనుల నీలాలు కారునురా
||అన్నాఏడవ్వకురా||

జో జో లాలీ.. లాలీ జో లాలీ

ఒక రాత్రీ ఒక పగలు పున్నమాను చెట్టుకింద
ఒంటొంటి బతుకాయే ఓ చందమామయ్యా
||జో జో లాలీ||

పినతండ్రి లక్ష్మణుడు ప్రతిదినమూ మిము దలచే
మీ తండ్రి రామునికి మీరుండేదే తెలియదురా
||జో జో లాలీ||

నెత్తిన కిరీటం నెలవంక నామమురా
పున్నమినాటి చంద్రుడా నా తండ్రీ ఏడవ్వకురా
||జో జో లాలీ||

పండ మంచము లేదు ఊపను ఉయ్యాల లేదు
జోలలు పాడుటకు దాదులు లేరయ్యా
||జో జో లాలీ||

ఉండేదీ కారడవి నే పండేదీ చిట్టడవి
అడవుల పాలవుతే మా అన్నాఏడవ్వకురా
||జో జో లాలీ||

# అయ్యయ్యో నా మరది



అయ్యయ్యో నా మరది అయ్యో లక్ష్మణా
అడవిలో మీ అన్నకు అతి భారమాయే

బంగారు మాయలేడి అది ఒక్కటయ్యా
మన పర్ణశాలకు ఇటు వచ్చెనయ్యా
దాన్ని చూసినంతనె నే కోరగాను
విల్లునంబులు బూని తా బోయెనంట

హా లక్ష్మణ హా సీతా అనుచు మీ అన్న
తలబోవుచున్నాడు మరది లక్ష్మణ
గండభేరుండడవి పులులు సింహాలు
అడవిలో మీ అన్నకు అతి భారమాయె

అడవిలో మీ అన్నకు అతిభారమైతే
యుగములేకుండాను జగములే పొంగు
రాజ్యమతడు కోరకున్నను నీవు కోరగాను
ఇదినీకు న్యాయమా మరది లక్ష్మణా

ఏ యుగమందున ఏ జన్మమందు
ఎవరీ సతీపతుల నెడబాపియుండ్రి?

# భరతుడా

*గానం: రామాంజనేయులు (అయ్యవారు)*

*బృందగానం: స్వాతి, భారతి, పావని, షాహింతాజ్ (పదవ తరగతి)*

*డప్పు: పోతలయ్య*



భరతుడా నా చిన్ని తమ్ముడ
క్షేమమా తలి దండ్రులు?
గురువు విశ్వామిత్రులు
కుశలమా పురి జనులు?

అన్నవిను మన కన్న తండ్రి
మొన్ననే చనిపోయెను
మనములేని సమయమందున
తండ్రి మరణము చెందెను

తమ్ముడా భరతయ్య మనము
ఉండి ఏమి ఫలమురా?
ముని కుమారుని తల్లిదండ్రులు
ముందు పెట్టిన శాపము

అడవికొచ్చుట ఏమి నేరము
అన్న నాతో తెలుపుమా?
ఏమి వేడుకలంటు వస్తివి
విభుని భూముల ఎదుటకు?

తమ్ముడా భరతయ్య నాకిది
తల్లిదండ్రుల ఆజ్ఞరా
పదిలముగ పదునాలుగేండ్లు
ఉండి మరల వస్తుము

పాదుకా పట్టాభిషేకము
నీకు ఇస్తిని తమ్ముడా
ధర్మమును విడనాడకుండా
రాజ్యమేలుము తమ్ముడా

అన్న నిన్నెడబాసి నేన-
యోధ్యపురము నందున

## కొత్తపల్లి అక్టోబర్ 2008

పదిలముగ పదునాల్గు నిముషము-
లేను నచట నుండను

తమ్ముడా భరతయ్య నీవిది
తప్పుగా భావించకు
కన్నతల్లిని కష్టపెట్టకు
కారణంబేమున్నది?

కారణంబేమున్నది కైకమ్మ
ముఖమెటు చూస్తును?